క్లుప్తంగా

ఛత్రపతి శివాజీది మచ్చలేని వ్యక్తిత్వం



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్ సభ్యులు

కాకినాడ రూరల్: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం, తాను చేస్తున్న పనిపై అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం ఛత్రపతి శివాజీ మహారాజ్ సొంతం అని బోటుక్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి వ్యక్తిగత విలాసాలకు ఎటువంటి వ్యయం చేయక ప్రజా సంక్షేమం కోసమే ఆయన పాటు పడ్డారన్నారు. లౌకిక పాలకుడైన శివాజీ అన్ని మతాలను గౌరవించేవారన్నారు. 27 ఏళ్ల పాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచిన శివాజీ 1680 ఏప్రిల్ 3న కాలం చేశారని అడబాల తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పెద్దాడ రాజీనామా



పెద్దాడ సుబ్బారాయుడు

కాకాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ రాజకీయ నాయకుడు పెద్దాడ సుబ్బారాయుడు తన క్రియాశీలక రాజకీయాలకు రాజీనామా ప్రకటించారు. ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రాజకీయాలు వికృత రీతిలో పరాకాష్ఠకు చేరుకున్నాయని, 1984–85 సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం ఎందరో గొప్ప నాయకులతో పనిచేశానన్నారు. పార్టీ పీసీసీ అధ్యక్షురాలికి తన రాజీనామా లేఖ పంపించినట్టు సుబ్బారాయుడు విలేకర్లకు తెలిపారు.


నవోదయకు 28 మంది ఎంపిక

యానాం: 2024–25 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయకు ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో రీజెన్సీ స్కూల్ నుంచి 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు, ఎన్.సత్యేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

పలువురిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: ఎన్నికల ప్రచార సామగ్రికి సంబంధించి తలెత్తిన వివాదంలో ఫిర్యాదు మేరకు పలువురిపై సర్పవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ రెండో డివిజన్ ఆర్ఆర్ నగర్‌లో ఒక భవనం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ప్రచార సామగ్రిని తరలిస్తున్నట్లు సీ విజిల్ యాప్ ద్వారా ఒక పార్టీ నాయకుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇరుపార్టీల మధ్య వివాదం చోటు చేసుకుంది. కె.రామకృష్ణ అనే వ్యక్తి సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో తమను అడ్డగించి దాడి చేశారని పలువురిపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేశారు.

నాటి పింఛను పాట్లు గుర్తొస్తున్నాయ్!



చదలాడ పంచాయతీ వద్ద పింఛన్ల కోసం క్యూ కట్టిన వృద్ధులు

పెద్దాపురం: ఒకటో తారీకు వస్తే చాలు తెల్లరాక ముందే తలుపు తట్టి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించే ప్రభుత్వంపై కక్షకట్టిన తెలుగు తమ్ముళ్ల చర్యలకు గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అందించే పింఛన్ చేతికందే ఆనందాన్ని పొగట్టి, మీ తెదేపా హయాంలో పింఛన్ల కోసం పడిగాపులు కాసే విధంగా మళ్ళీ మాకు కష్టాలు తెప్పించారా అంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. మా పాపం ఊరిపోదని, నడవలేని స్థితిలో ఉన్న మాపై మీకెందుకీ కక్ష అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం మండలంలో ఒక్కటో తారీఖు సాయంత్రానికి పింఛన్ల పంపిణీ పూర్తి స్థాయిలో అందించే వారు. కానీ ఈ నెల మూడో తారీకు వచ్చినా పింఛన్ కోసం పంచాయతీ వద్దకు వచ్చి క్యూలో నిల్చుని తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓటేసి మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంటామని చెప్తున్నారు లబ్ధిదారులు.

అందరికీ సొంతిల్లు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 46వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్యే ద్వారంపూడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి మహాలక్ష్మి



ఎన్నికల ప్రచారంలో వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి

కాకినాడ: ఇళ్ల స్థలాలను మంజూరు చేసిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి 2025 డిసెంబర్ నాటికల్లా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన స్థానిక 46వ డివిజన్ మహాత్మా వీధి, మిలట్రీ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గడిచిన ఐదేళ్లలో 46వ డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి సకల మౌళిక సదుపాయాలను కల్పించామని తెలిపారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సరైన ఎజెండా లేకుండా కేవలం వైఎస్సార్ సీపీపై బురద చల్లడమే లక్ష్యంగా ఆచరణ సాధ్యం కాని హామీలతో ముందుకు వస్తున్న కూటమి పార్టీలను నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి పదివేల మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకున్నామని, అయితే ఎంతమంది అర్హులున్నా స్థలం ఇచ్చేందుకు వెనుకాడవద్దన్న సీఎం సూచన మేరకు 30 వేల మందికి ఇచ్చామని తెలిపారు. ఇచ్చిన స్థలాలపై సంపూర్ణ హక్కు ఉండాలనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్లు కూడా చేసి ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇచ్చిన స్థలాల్లో ఇప్పటికే 11 వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని చెప్పారు. ఏది ఏమైనా అర్హులైన ప్రతిఒక్కరికీ సొంతింటి కల సాకారం చేస్తానని, ఇందుకోసం తనను మరోసారి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కే బాలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో ద్వారంపూడి సతీమణి..

ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 39వ డివిజన్ గాంధీనగర్‌లోని సుబ్బయ్య హోటల్ ప్రాంతం నుంచి ప్రారంభించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకినాడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తన భర్త ద్వారంపూడిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆమెకు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికి సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంపీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు డీకే రెడ్డి, బాదం మధు, దండుమహంతి లక్ష్మణరావు, ఇనుకొండ పట్టాభి రామయ్య, కుసుమకుమారి, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్లవికి స్విగ్గీ మహిళా పారిశ్రామిక పురస్కారం



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ నుంచి అవార్డు అందుకుంటున్న పల్లవి

బోట్‌క్లబ్: కాకినాడకు చెందిన హైగ్ మల్టికుజన్ రెస్టారెంట్ యజమాని కాకిలేటి పల్లవికి స్విగ్గీ మహిళ పారిశ్రామికవేత్తల ప్రతిభా పురస్కారం లభించింది. స్విగ్గీ ఆధ్వర్యంలో ఆమె మార్పు-ప్రాంతీయ విస్తరణ అనే అంశంపై ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పల్లవిని సత్కరించి అవార్డు అందించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ దేశంలో ఆహార పానీయాల పరిశ్రమల్లో 50 వేలు కంటే ఎక్కువ స్త్రీలు నిర్వహించే రెస్టారెంట్లతో, ప్రతి రెస్టారెంట్‌లో సగటున ఆరుగురు ప్రత్యక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు అందుకున్న పల్లవిని నగరానికి చెందిన పలువురు అభినందించారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



మత్స్యకారులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సర్పవరం గ్రామం నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తదితరులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: దుమ్ములపేట ప్రాంతానికి చెందిన సుమారు 120 మంది మత్స్యకారులు బుధవారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మత్స్యకార నాయకులు వాసుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు ముందుకు రాగా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఏనాడూ మత్స్యకార ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రధానంగా మత్స్యకారులు అధికంగా నివసించే దుమ్ములపేట గ్రామాన్ని దత్తత తీసుకున్న వనమాడి ఏమాత్రం పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దుమ్ములపేట ప్రాంతంలో సీఎస్ఆర్ నిధులతో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుతో పాటు రూ.11 కోట్ల వ్యయంతో రహదారులు, డ్రైనేజీల వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. తనను మరోసారి గెలిపిస్తే మినీ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో పేర్ల హల్లెలూయ, మైలపల్లి మార్కు, మోసా తాతారావు, మోసా రామస్వామి, పిక్కి అజయ్, దలిపిల్లి మల్లీశ్వరి, పిక్కి అక్కమ్మ, మోసా శాంతి, మోసా మంగ, మోసా కమల తదితరులు ఉన్నారు.

టీడీపీ ముఖ్య నాయకుల చేరిక

మండలంలోని సర్పవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు వాసంశెట్టి పోతురాజు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సవరం చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ తాళ్ల శ్రీనివాస్ తదితరులు తమ అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసిన కన్నబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని, వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుల్ల చందు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక అన్నమ్మఘాటీ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈఈ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు.

అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని నరసింహరోడ్డు, శివాలయం వీధి, తారకరామనగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర్ నగర్, పప్పుల మిల్లు ప్రాంతం, రిక్షాల పేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవి నగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయణమ్మతోట, కాపుల వీధి, మున్సిఫ్‌జంక్షన్, కొవ్వూరు, డి-మార్ట్, శుభం కొంటీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఈఈ ప్రసాద్ కోరారు.

డీ1 సెక్షన్ పరిధిలో..

అలాగే కాకినాడ డి 1 సెక్షన్ పరిధిలోని సంత చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్, రంగయ్యనాయుడు ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ జి.ప్రసాద్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రంగయ్యనాయుడు వీధి, యాళ్లవారి సందు, కొయ్యవారి సందు, జ్యోతులవారి సందు, బ్రాహ్మణ వీధి, దూళ్లవారి వీధి తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యుత్ వినియోగదారులు అసౌకర్యాన్ని గమనించి తమకు సహకరించాల్సిందిగా ఈఈ ప్రసాద్ తెలిపారు.

పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ



పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సిబ్బందిని ఆరా తీస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: సచివాలయాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు బుధవారం పరిశీలించారు. స్థానిక రామారావుపేట, గాంధీనగర్, మెయిన్ రోడ్డు, దుగ్గిరాల వారి వీధి, పగోడా మున్సిపల్ స్కూలు తదితర ప్రాంతాల్లోని సచివాలయాలను కమిషనర్ సందర్శించారు. పింఛన్‌దారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పింఛన్లు అందజేయాలని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పింఛన్లు అందజేస్తున్న తీరును పర్యవేక్షించి సూచనలిచ్చారు.

రూరల్‌లో 57 శాతం పంపిణీ

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సామాజిక పింఛన్ల పంపిణీ నిలిపివేయడంతో ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించింది. కాకినాడ రూరల్ మండలంలో మొత్తం 41 గ్రామ సచివాలయాలకు గాను 18,453 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. తొలిరోజు రాత్రి 7 గంటలకు 57 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం రూ.5,49,21,500 పింఛన్ సొమ్ము విడుదల కాగా 10,354 మందికి రూ.3,12,94,000 సొమ్ములు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీవో రమేష్‌నాయుడు పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు



ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏఓ ప్రశాంతి

తాళ్లరేవు: రబీ పంట ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ధాన్యం కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దిగుబడికి అనుగుణంగా గోనె సంచులు, రవాణాకు అవసరమైన ట్రాక్టర్లు, లారీలను సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ వారం పది రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల పరిధిలోని 21 ఆర్బీకే కేంద్రాలకు సంబంధించి 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సాధారణ రకం ధాన్యం 75 కేజీలకు రూ.1,637, గ్రేడ్ -ఎ రకం ధాన్యం 75 కేజీలకు రూ.1,652 ధరకు కొనుగోలు చేస్తామన్నారు.

మాదిగల ఐక్యత చాటి చెబుతాం

- వైఎస్సార్ సీపీకే మా మద్దతు
- నియోజకవర్గ మాదిగ సంఘ నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ

సామర్లకోట: మాదిగల ఐక్యతను చాటి చెప్పడానికి ఈ నెల 12వ తేదిన మాదిగల ఆత్మీయ సమేళనం ఏర్పాటు చేసినట్టు మాదిగ ఐక్యవేదిక నాయకులు పలివెల జనార్దన్, కాళ్ల లక్ష్మీనారాయణ, కాతేటి అరుణ్‌కుమార్ తెలిపారు. మాదిగల ఉనికి తెలియజేయడానికి మాదిగలు అందరూ ఒకే తాటిపైకి వచ్చారన్నారు. నియోజకవర్గంలో మాదిగలు కోల్పోతున్న అవకాశాలను తెలుసుకుని అధికార పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతీ మాదిగ ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీతో జరుగుతున్న మేలును తెలియజేసి ప్రతి ఒక్కరూ ఆ పార్టీ మద్దతు ఇవ్వాలని కోరతామన్నారు. ఈ మేరకు 12న నియోజకవర్గ స్థాయి మాదిగల సమ్మేళం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, మాదిగ నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ సంఘ నాయకులు విప్పర్తి రవి, చిందాడ ప్రకాశరావు, మిరియాల సాగర్, జొన్నాడ రమేష్, కాండ్రకోట హరి, ఉప్పాడ రమణ, తాతపూడి చిన్న, మహేష్, నరేష్, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న సెలవు ప్రకటిస్తూ గెజిట్ విడుదల

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజున అన్ని ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎంవీ హిరాన్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రజలందరూ పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కార్యాలయానికి సైతం ఆదేశాలు జారీ చేశారు.

మండే ఎండకు టండాగా..

- శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ
- సీజనల్ వ్యాపారంతో ఎందరికో ఉపాధి
- పల్లెల నుంచి పట్టణాలకు వలస



రాజేశ్వరి నగర్‌లో పుచ్చకాయలు తింటున్న వినియోగదారులు



ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని చెరుకు రసం తాగుతున్న ప్రజలు

బోట్‌క్లబ్: ఎండలు మండుతున్నాయి. బయటకు వెళితే గొంతు ఎండిపోతుంది. దీంతో దాహం తీర్చుకునేందుకు శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. వారం రోజులుగా ఎండలు విపరీతంగా ఉండడంతో దీనికి అనుగుణంగానే నగరంలో స్థానిక సర్పవరం జంక్షన్, బోట్‌క్లబ్ పార్కు, నాగమల్లితోట జంక్షన్, జేఎన్‌టీయూకే, భానుగుడి, బాలాజీచెరువు, జగన్నాథపురం, జెడ్పీ సెంటర్ ఇలా ఎక్కడపడితే అక్కడ శీతల పానీయాల దుకాణాలు కన్పిస్తున్నాయి. పలు సెంటర్లలో ఐస్‌క్రీం దుకాణాలు పుచ్చకాయల విక్రయాలు బాగా పెరిగాయి. మార్కెట్‌లో దొరికే వివిధ రకాల రుచులతో కూడిన ఫ్లేవర్లతో ఫ్రూట్ సలాడ్‌లను తయారుచేస్తున్నారు. ఆరెంజ్, నిమ్మ, మిక్స్‌డ్ ఫ్రూట్ తదితర సలాడ్‌లు గ్లాసు రూ.20 వరకూ విక్రయిస్తున్నారు. చెరకురసం నిమ్మసోడా బండ్లు ఎక్కడ చూసినా కనిస్తున్నాయి. నిమ్మకాయ మసాలా సోడా, నిమ్మకాయ సోడా, అల్లంతో చెరుకురసం, నిమ్మకాయ చెరుకు రసం ఇలా రకరకాలుగా నిమ్మకాయతో చెరుకు రసం ఉన్న గ్లాసు రూ.20కి విక్రయిస్తున్నారు. మండుతున్న ఎండలకు ఉపశమనం పొందేందుకు ప్రజలు ఐస్‌క్రీం పార్లర్లవైపు పరుగులు పెడుతున్నారు. దీంతో స్థానిక కుళాయిచెరువు ఎదురుగా ఉన్న పలు ఐస్‌క్రీం పార్లర్లు కిటకిటలాడతున్నాయి. రకరకాల ఫ్లేవర్లతో ఐస్‌క్రీం విక్రయిస్తున్నారు. ఒక్కొక్క ఐస్‌క్రీం రూ.20 నుంచి రూ.80 వరకూ కొనుగోలు చేస్తున్నారు.

ఎంతో మందికి ఉపాధి

వేసవిలో సీజనల్‌గా వెలిసిన శీతల పానీయాల దుకాణాలు వందలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. మామూలు రోజుల్లో కూలిపనులు చేసుకుని వారు ఆటోలు నడిపేవారు, కూరగాయలు విక్రయించేవారు పనులు మానివేసి ఎండా కాలం ముగిసే వరకూ శీతల పానీయాల దుకాణాలు నడుపుతున్నారు. కేవలం రూ.పదివేలు పెట్టుబడితో జీవనోపాధి పొందుతున్నారు.

కొబ్బరి బొండంతో దాహానికి చెక్

వేసవిలో శీతల పానీయాల కంటే కొబ్బరి బొండం తాగడం ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. దీంతో కొబ్బరి బొండాలు విక్రయించే దుకాణాలు నగరంలో రోజురోజుకీ పెరుగుతున్నాయి. గత నెలలో రూ. 15 ఉండే కొబ్బరి బొండం ప్రస్తుతం రూ.20కి చేరింది. అయినప్పటికీ కొబ్బరిబొండాలు తాగేందుకు ప్రజలు వెనుకాడడం లేదు. కాకినాడ నగరంలో గతంలో కేవలం 30 మాత్రమే కొబ్బరి బొండాలు విక్రయించే షాపులు ఉండేవి. కానీ ప్రస్తుతం 50కి పైగా ఉన్నాయంటే కొబ్బరి బొండాలకు ఉన్న క్రేజ్ వేరే చెప్పాల్సిన పనిలేదు.

ఏడేళ్లుగా విక్రయిస్తున్నా



మాది పిఠాపురం. గత ఏడు సంవత్సరాలుగా వేసవిలో చెరుకురసం విక్రయిస్తున్నారు. గత పది రోజులుగా ఎండలు విపరీతంగా ఉండడంతో వ్యాపారం ఊపందుకుంది. అన్నీపోను రూ.700 నుంచి రూ.900 వరకూ మిగులుతుంది.

– గుర్తుర్తి రమణ, చెరుకురసం విక్రేత

మంచి గిరాకీ ఉంది



ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రతి ఫ్రూట్ జ్యూస్‌కు చాలా గిరాకీ ఉంది. నాతో పాటు ఒక పనివాడు ఇక్కడ పనిచేస్తున్నాడు. ప్రతి రోజు పెట్టుబడి పోను రూ.500కి పైగా లాభం వస్తుంది. ఎండాకాలం పోయిందంటే జ్యూస్ సెంటర్ మూసేస్తాను.

– కోటపురెడ్డి రాజు, ఫ్రూట్ జ్యూస్ విక్రేత

పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తా



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైథిలింగం, నారాయణసామి తదితరులు

యానాం: యానాంలో పరిశ్రమలు మూతపడటంతో నిరుద్యోగులు ఉపాధి లేక వలసలు వెళుతున్నారని, పరిశ్రమలను తెరిపించేలా కృషి చేస్తానని కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థి వైథిలింగం హామీ ఇచ్చారు. పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న వైథిలింగం బుధవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నారాయణసామి, మాజీ కేంద్ర రక్షణ మంత్రి ఎం.పళ్లంరాజు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు ముందుగా స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. బాలయోగి స్టేడియం ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ రోడ్డు, పిల్లారాయవీధి, చిన్నాసెంటర్, అంబేద్కర్ సర్కిల్, మెట్టకూరు, గోపాల్‌నగర్, కనకాలపేట, యూకేవీనగర్, సావిత్రినగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, అర్థాని దినేష్, బంగారం, పుదుచ్చేరి ఎమ్మెల్యే వైద్యనాథన్, రుద్రరాజు, పెద్ద సత్య పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.